# ఎండలు! ఎండలు!!

అమృతపాణి

వేసవి వచ్చిందంటే చాలు... ఇంట్లో ఉండ బుద్ధికాదు సత్యమూర్తికి. ఎక్కడికయినా వెళ్లి పోదామనుకుంటుంటాడు. డబ్బున్నవాళ్లు ఎండల్ని లెక్కచెయ్యరు. విశాలమైన భవంతుల్లో అందంగా అలంకరించబడిన ఎయిర్‌కండిషన్ రూముల్లో - ఖరీదయిన సోఫాల్లో కూర్చుని ఐస్‌క్రీములు తింటూనో, కూల్‌డ్రింక్స్ తాగుతూనో హాయిగా ఆనందంగా కాలం గడిపేస్తారు. వాళ్లకి ఇల్లువదిలిపెట్టి అవతలికి వెళ్ల బుద్దే అవదు.

కానీ - సత్యమూర్తి సంగతి అలాకాదు.

చాలీచాలని జీతంతో బతుకుని వెళ్లదీసే మధ్యతరగతి మనిషి అతను.

అతనుండేది ఇరుకిల్లు. తలుపులు తీస్తే ఎండంతా ఇంట్లోనే ఉంటుంది. తియ్యకపోతే ఒకటే గుమాయింపు! ఒళ్లంతా చెమట కారి పోతూ ఉంటుంది. షర్టు, బనీను తడిసిపోతూ ఉంటాయి. దాహం వేసి మంచినీళ్లుతాగుదామనుకుంటే కుళాయిలోంచి వేడినీళ్లొస్తూ ఉంటాయి.

మండే ఎండల ప్రభావం మనుషుల మస్తిష్కాలమీద కూడా ఉంటుంది. ఎండలు భరించలేని స్థితి వచ్చినప్పుడు మామూలుగా ఉండే మనుషులు కూడా తిక్కతిక్కగా మాట్లాడుతూ వింతవింతగా ప్రవర్తిస్తుంటారు!

సాదాసీదాగా మొదలైన ఎండలు చూస్తూండగానే తారాస్థాయికి చేరాయి. అగ్నికి ఆజ్యం తోడయినట్టుగా ఎండలకి వడగాడ్పులు తోడయ్యాయి. బయటికి రావటానికి భయపడి ప్రజలు ఇళ్లల్లోనే ఉండిపోతున్నారు.

ఆ రోజు - సత్యమూర్తి ఇంట్లో వాళ్లందరితోటీ తగువుపెట్టుకున్నాడు...

పప్పులో ఉప్పు తక్కువయిందని పెళ్లాంతో తగువుపెట్టుకున్నాడు. ఇద్దరి మధ్యా జరిగిన వాదులాటలో ఆమె పక్షం వహించినందుకు బావమరిదితో తగువుపెట్టుకొన్నాడు. ఆర్నెల్ల క్రితం తనింటికి చేరి నిక్షేపరాయుడి మల్లే కాలం గడిపేస్తున్నాడనే అక్కసు అతనికుంది. తనపక్షం వహిస్తూ మాట్లాడబోయిన మరదలితో తగువు పెట్టుకొన్నాడు. అక్కకి ద్రోహం చేస్తున్నానన్న ఆలోచనన్నా లేకుండా ఎవరూ లేనప్పుడు తనకి లైనేస్తోందన్న కోపం అతనికుంది. 'నన్ను ప్రశాంతంగా అన్నం తిననియ్యవుకదరా!' అన్నందుకు తండ్రితో తగువుపెట్టుకున్నాడు, 'ఆయనేం అన్నారనీ? అంతగా ఎగిరిపడుతున్నావు?' అన్నందుకు తల్లితో తగువుపడ్డాడు. అదేపనిగా ఏడుస్తూ బుర్రకొరికేస్తోన్న ఆరేళ్లకొడుకుని దబదబా రెండుబాదులు బాది - ఏడుపుగొట్టు వెధవా అని తిట్టి కంచంలో చెయ్యి కడిగేసుకొని "అదేమిటండీ అలా వెళ్లిపోతున్నారు! మీకోసం సేమ్యాపాయసం చేసాను" అని అర్ధాంగి అంటున్నా విననట్టుగా అవతలికి వెళ్లిపోయాడు.

కాలవ్వారంటే వెళ్లి - రైలుపట్టాలు దాటి - సన్నగా మెలికలు తిరిగిన కాలిబాటమ్మట నడుస్తున్నాడు.

నడుస్తున్నంతసేపూ ఇంటిని, ఇంట్లోవాళ్లనీ తిట్టుకొంటూనే ఉన్నాడు.

ఒక చోటికొచ్చేప్పటికి - కాలిబాట ఆగిపోయింది.

మున్సిపాల్టీ వాళ్లు చెత్తాచెదారాన్ని డంప్ చేసే స్థలం అది. భరించలేనంతగా ఉంది దుర్గంధం.

అయినా పట్టించుకోకుండా ముందు కెళ్తున్నాడు. ఎండ నిప్పులు చెరుగుతోంది. వడ గాడ్పులు వీస్తున్నాయి. కళ్లు బైర్లుకమ్ముతు న్నాయి.

గుట్టలుగుట్టలుగాపడి ఉన్న చెత్తాచెదారం



మధ్యనుంచి నడుస్తున్నాడు. వెనక్కి మరలాలన్న ఆలోచన కూడా కలగటం లేదు!

'ఆగూ- ఆగూ-' అన్నమాటలు వినిపించాయి.

ఎవరు చెప్మా? అనుకుంటూ చుట్టూ చూసాడు. గుట్టల వెనకాల గుడిసెలున్నాయి. గుట్టల వెనకాల నుంచి ఒక పిల్లాడొచ్చాడు.

సన్నగా పొట్టిగా ఉన్నాడు. ముఖం అందంగానే ఉంది గానీ మట్టికొట్టుకుపోయి ఉంది. చింకి చొక్కా, లాగు వేసుకొన్నాడు.

"మీరు డాక్టరాండీ?" అన్నాడా కుర్రాడు అతనికేసి ఆదుర్దాగా చూస్తూ.

"ఏం? ఎందుకూ?" అనడిగాడు.

"ఏం లేదండీ. మా అమ్మకి బాగోలేదండి. మీరు డాక్టరయితే చూస్తారేమోననీ" నసుగుతూ అన్నాడు.

"నేను డాక్టర్‌ని కాదు" అన్నాడతను.

"నిజంగానే కాదాండీ?" అనడిగాడు.

తను డాక్టర్ కాదని చెప్పిందే చెప్పి వాణ్ణి నిరాశపరచడం ఇష్టంలేక "మీ ఇల్లెక్కడ?" అనడిగాడు.

"ఇదిగో ఈ గుట్టెనకాతలేనండి. రండి... త్వరగా రండి" అన్నాడు అతని చెయ్యి పట్టుకుంటూ. వాడితోబాటు గుట్ట వెనకాలున్న గుడిసెలోకి వెళ్లాడు.

మట్టిగోడలతో కట్టిన గుడిసె అది.

ముందు గదంతా మాసిన చింకి గుడ్డలు, పనికిరాని సామాన్లు పడున్నాయి. వెనకాల మరో గది ఉంది. "రండి. లోపలికి రండి." అంటున్నాడు వాడు. గది మూలగ చింకి చాప మీద పడుకొన్న వ్యక్తి గబుక్కున లేచి నుంచుంది! ముప్పై ఏళ్లుండొచ్చు. మనిషి పొడుగ్గా ఉంది. మాసిన చీర, వెలిసిపోయిన జాకెట్టుతో ఉంది.

మొహం నీరసంగా ఉంది. కళ్లలోతుకుపోయి ఉన్నాయి. జుట్టు చిందరవందరగా ఉంది. దారిద్ర్యం మనుషుల్ని ఎలా కుంగదీస్తుందో ఆమెని చూసి తెలుసుకోవచ్చు.

ఆమె అతనికేసి దీనంగా చూస్తూ "వచ్చారా... రండి... రండి... ఇన్నాళ్లకి దయకలిగిందన్న మాట మామీద!" అంది.

ఆమె మాటలు అతనికేం అర్థంకావటం లేదు.

"ఏమిటి మీరంటున్నది?" అనడిగాడు.

"పెళ్లాన్నెక్కడయినా మీరని సంబోధిస్తారా? మీరు విడిచి వెళ్లినప్పటి నుంచి ఇలా అవస్థలు పడుతున్నాం".


'నేను విడిచివెళ్లటమేమిటి? మతిపోయిందతనికి'.

"ఎవరికీ చెప్పాపెట్టకుండా నన్ను, పిల్లల్ని నిర్దయగా వదిలేసి వెళ్లిపోయారు? మీ అంతటి దుర్మార్గులెవరూ ఉండరు?" అందామె నిష్టూరంగా.

"ఎవరిని చూసి ఎవరనుకొంటున్నారు మీరు?" అడిగాడతను తీక్షణ స్వరంతో.

"నన్ను మోసం చేద్దామని ప్రయత్నించకండి. మీరు మీరేనని నాకు బాగా తెలుసు?" అందామె అతనికేసి కోపంగాచూస్తూ. ఆ కుర్రాడు చప్పట్లు కొడుతూ 'నాకు బాగా తెలుసు?' 'నాకు బాగా తెలుసు?' అంటూ అతని చుట్టూ తిరగడం మొదలెట్టాడు?

ఇదెక్కడి గొడవరా బాబూ అనుకొంటూ "మీరు పొరబడ్డారు? నేను మీ భర్తని కాను.




మీరు నా భార్యా కాదు" అన్నాడు.

"మీరలా అనగానే వదిలేస్తాననుకోకండి. నాదగ్గర రుజువులున్నాయి" అందామె ధృడమైన స్వరంతో.

"రుజువులున్నాయి? రుజువులున్నాయి?" అంటూ ఆ కుర్రాడు అతని చుట్టూ తిరుగుతూ డాన్స్ చెయ్యడం మొదలెట్టాడు.

"రుజువులా? రుజువులేమిటి?" అన్నాడు కంగారుపడుతూ.

"మీరు నన్ను పెళ్లి చేసుకొన్నట్టుగా?" అంది.

విషయం చాలా దూరం వెళ్తోందనిపిం చింది. మర్యాదగా మాట్లాడితే లాభంలేదని పించింది.

"పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యమాక? జ్వరం తో బాధపడుతున్నావంటేనూ – జాలిపడి వచ్చా ను. వస్తాను" దూకుడుగా మాట్లాడుతూ అవత లికి అడుగెయ్యబోయాడు.

"నిన్ను వెళ్లనిచ్చేది లేదు. ఇప్పుడు నిన్నొది లేస్తే ఇంకెంతమందిని మోసం చేస్తావో?" బుస కొడుతున్నట్టుగా అంది.

'ఇంకెంత మందిని మోసం చేస్తావో?' ఇం కెంత మందిని మోసం చేస్తావో? అంటూ చప్పట్లు కొడుతూ అతని చుట్టూ తిరగటం మొదలుపెట్టాడు ఆ కుర్రాడు. వాడి న్యూసెన్స్ భరించడం మరీ కష్టంగా ఉంది.

ఆ విషయానికంతటితో ఫుల్‌స్టాప్ పెట్టడం మంచిదనుకొని "మళ్లీ చెబుతున్నాను. నేన్నీ భర్తని కాను. నమ్మితే నమ్ము లేకపోతే లేదు. నేవెళ్తాను" అన్నాడు.

"ఒక్క క్షణం ఆగు" అంటూ ఆ కుర్రాడికి సైగచేసింది. వాడు లోపలికి వెళ్లి చేతి సంచీ తీసుకొచ్చి ఆమెకిచ్చాడు. ఆమె అందులోంచి మడతపెట్టి ఉన్న కాగితాన్ని తీసి అతనికిచ్చి "చదివి చూడు" అంది తీవ్రమైన స్వరంతో.

అతను కాగితాన్ని తీసుకొని మడత విప్పి

చదివాడు. మేరేజ్ సర్టిఫికెట్టు!

సత్యమూర్తి అనే అతను పద్మావతి అనే ఆమెని వివాహం చేసుకున్నట్టుగా రిజిస్ట్రార్ ఇచ్చిన సర్టిఫికెట్ అది. వివాహం విజయవాడ లో వధువు తండ్రి ఇంట్లో పంతొమ్మిది వందల తొంభై ఎనిమిదో సంవత్సరం ఫిబ్రవరి రెండో తేదీన జరపబడినట్టుగా దాంట్లో చెప్పబడి ఉంది.

తన పేరూ ఆమె భర్త పేరూ ఒకటేకావటం, తన భార్య పేరూ, ఆమె పేరూ ఒకటేకావటం, వివాహపు తేదీలు కూడా ఒకటే కావటం... అంతా మిస్టరీగా అనిపించింది అతనికి?

"నీ పేరు పద్మావతా?" అనడిగాడు ఆశ్చ ర్యంగా.

"తెలియనట్టుగా అడుగుతావే? ఈమారు నిన్నొదిలేది లేదు. పోలీసులకి రిపోర్టు చేస్తాను. జైలు కటకటాలే నీకు గతి".

ఆ కుర్రాడు అతని చుట్టూ తిరుగుతూ డాన్స్ చెయ్యడం మొదలెట్టాడు. 'జైలు కటకటాలే నీకు గతి. జైలు కటకటాలే నీకుగతి' అంటూ. ఏమిటీ సంకటస్థితి అనుకుంటూ "ఏం చేసుకోంటావో చేసుకో నేను వెళ్తున్నాను" దురుసుగా అని అవ తలికి అడుగేసాడు.

అంతలో 'ఆగండి బాబూ' అంటూ ఒక ముసలావిడ లోపలగదిలోంచి ఇవతలికొచ్చింది?

అప్రయత్నంగా ఆగిపోయాడు.

ఆమె కళ్లనీళ్లు పెట్టుకొంటూ చెప్పింది. "ఇది నా కూతురుబాబూ! చాలా కాలం క్రితమే మతిస్థిరం తప్పింది దీనికి. ఎవర్ని చూసినా తన మొగుడే అనుకొని గొడవ చేస్తూంటుంది. ఆ కుర్రాణ్ణి వేలెట్టి చూపిస్తూ "ఇదిగో ఈ తుంటరి వెధవ దారంటపోయే వాళ్లని ఆపుచేసి వాళ్లమ్మకి బాగోలేదని చెప్పి ఇంట్లోకి లాక్కొ స్తుంటాడు." అంది.

కూతురు కేసి చూస్తూ "ఆయన మీ ఆయన కాదు. వీదంట పోయేవాళ్లని లోపలికి పిలి పించుకొని ఎందుకు రభస చేస్తావ్?" అంది కోపంగా.

"కాదా?" అంటూ ఆమెతల వాల్చుకుంది. పిల్లవాడు అవతలికి పారిపోయాడు.

అతనడిగాడు "ఆమె భర్త ఆమెను వదిలి ఎందుకు వెళ్లిపోయాడు?"

"దీని భర్త ఆర్మీలో పని చేస్తూండేవాడు బాబూ. యుద్ధంలో చనిపోయాడన్న వార్త తెలిసి నప్పటి నుంచీ ఇదిగో ఇదిలా అయిపోయింది. ఈ వయస్సులో వీళ్లని పోషించడం కోసం ఇక్కడా అక్కడా కష్టపడాల్సొస్తోంది?" అంది కళ్లు తుడుచుకొంటూ.

వాళ్లపరిస్థితి చూస్తే అతనికి జాలేసింది.


జేబులోంచి పదిరూపాయల నోటుతీసి ఆమె చేతిలో పెడుతూ "వస్తానమ్మా" అంటూ చరచరా అడుగులేసుకొంటూ అవతలికెళ్లి పోయాడు!

గుట్టలుదాటి - కాలిబాటమ్మటే నడిచి - రైలుకట్టదాటి కాలవ్వారమ్మటే నడిచి ఇంటికి చేరుకున్నాడు. వీధిగుమ్మంలో నుంచుని అతని రాకకోసమే ఎదురుచూస్తోంది అతని భార్య.

అతన్ని చూస్తూనే ఇంతమొహం అయింది ఆమెకి!

"వచ్చారా! రండి రండి..." అంటూ చెయ్యి పట్టుకొని లోపలికి తీసుకెళ్లింది.

లోపలికొచ్చి కూర్చున్నాక గ్లాసుతో మంచి నీళ్లిచ్చింది! అతను కొద్దిగా స్థిమితపడ్డాక




"అన్నం తినకుండా వెళ్లిపోయారు! ఆకలేస్తోందో ఏమో! వేడిగా అన్నం వండిపెడతాను. ఈలోగా సేమ్యాపాయసం తాగండి" అంటూ పాయసం గ్లాసు టేబుల్‌మీద పెట్టింది.

అతను గబగబా పాయసం తాగాడు. వంటింట్లోకెళ్తున్న భార్యకేసి చూస్తూ 'పిచ్చి కొయ్య! నాకోసం ఎంత అగ్గగ్గలాడిపోతోందీ!' అనుకొన్నాడు.

జరిగిన విషయమంతా ఆ రాత్రి భార్యకి చెప్పాడు. "అయిందేదో అయిందిలెండి! మీరు రెస్టు తీసుకోండి" అంది అతని కాళ్లు వత్తుతూ.

* * *

కొద్దికాలం తర్వాత...

కుతూహలం కొద్దీ – కాలవ్వారమ్మటేవెళ్లి – రైలుకట్ట దాటి – కాలిబాటమ్మటనడిచి – చెత్తాచెదారం గుట్టల దగ్గరకి చేరుకున్నాడు.

గుట్టలమ్మటే వెళ్లి – గుడిసెదగ్గరికెళ్లి – వాళ్లని కలుసుకొని వీలైన సహాయం చెయ్యాలన్నదే అతని కోరిక.

కానీ ఎంత తిరిగినా ఒక్క గుడిసెకూడా కనపళ్లేదు. ఏమైపోయారూ? అనుకొంటూ తెగ వెతికాడు. కానీ వాళ్లు కనబడితేనా? నిరాశగా కాళ్లీడ్చుకొంటూ ఇంటికి తిరిగొచ్చాడు. భోజనం చేశాక ఈ మాటా ఆ మాటా మాటలాడుతూ – భార్యకి జరిగింది చెప్పాడు. అంతా విని – "సర్లెండి!" అందామె.

"సర్లెండంటున్నావే! నే చెప్పింది నమ్మటం లేదా?" అనడిగాడు.

"ఆ రోజున ఎండనపడి వెళ్లారుకదా – తిక్కతిక్కగా ఉండి ఏదేదో ఊహించుకొనుంటారు?" అందామె – ఇందులో ఏముందన్నట్టుగా!

"ఊహే అంటావా?"

"కాక?"

ఆమెకేం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక బుర్ర గోక్కున్నాడు. ●